ఆటోలు ఔటర్ బయటికే!

- కోర్ సిటీలో డీజిల్ వాహనాలు ఉండనివ్వం
- సీఐఐ జాతీయ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి
- 26 నుంచి 4 పథకాలు.. నేటి నుంచే సభలు
- ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే ఇందిరమ్మ ఇండ్లు
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశాలు

కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): రాజధానిలోని డీజిల్ ఆటోలు, బస్సులు, ఇతర వాహనాలను ఔటర్ రింగ్ రోడ్డు బయటకు పంపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో శుక్రవారం జరిగిన సీఐఐ జాతీయ కౌన్సిల్‌లో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. ఫ్యూచర్ సిటీని దేశంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతామని, ప్రపంచ మేటి నగరాలైన న్యూయార్క్, లండన్, సియోల్, దుబాయ్‌తో పోటీపడేలా నిర్మిస్తామని చెప్పారు. అనంతరం సచివాలయంలో ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలోని ఆదివాసీలకు రాజకీయంగా న్యాయం చేస్తామని, కుమ్రం భీం జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఆదివాసీ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సదుపాయం, సాగు, తాగునీటి వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉద్యమ నేపథ్యంలో ఆదివాసీలపై నమోదైన కేసులను తొలిగిస్తామని భరోసా ఇచ్చారు.

సాగుయోగ్యమైన భూములకే రైతుభరోసా

మధ్యాహ్నం తర్వాత సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో జరిగిన సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. పంట వేసినా, వేయకపోయినా సాగుయోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తామని సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ నాలుగు పథకాల అమలుపై రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభల నిర్వహణ, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించేందుకు శనివారం నుంచి ఈ నెల 15 వరకు సన్నాహాలు చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయానికి అక్కరకు రాని భూములను గుర్తించి రైతు భరోసా నుంచి మినహాయించాలని, వాటిని సభల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. ఇన్‌చార్జి మంత్రి ఆమోదించిన ఇందిరమ్మ ఇండ్ల జాబితానే అర్హుల జాబితా విడుదల చేయాలని ఆదేశించారు. కొందరు అధికారులు పనితీరును మార్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 26 తర్వాత జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తానని, నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

12 లక్షల వాహనదారులపై ప్రభావం

'రాజధానిలోని డీజిల్ ఆటోలు, బస్సులు, ఇతర వాహనాలను ఔటర్ బయటకు పంపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో సుమారు 12 లక్షల మంది వాహనదారులపై ప్రభావ పడనున్నది. ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన ఆటోవాలాలపై మరో పిడుగు పడినట్టయింది. స్కూల్ బస్సులు, క్యారియర్లు, లారీలు నడుపుతూ ఉపాధి పొందుతున్న డ్రైవర్లు ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉన్నది. సీఎం ప్రకటనలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ఆటోవాలాలు, క్యాబ్‌లు, స్కూల్ బస్సుల డ్రైవర్లు, ఇతర డీజిల్ వాహనాల డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ మూడు జిల్లాల్లో కలిపి దాదాపు కనీసం 12 లక్షల వాహనాలను ఔటర్ బయటకు తరలించాల్సి వస్తుందని తెలుస్తున్నది.

ఫ్యూచర్ సిటీపై ఎందుకీ హడావుడి

ఫ్యూచర్ సిటీపై సీఎం రేవంత్‌రెడ్డి తరచూ చేస్తున్న హడావుడి ఎందుకు చేస్తున్నారోనని విశ్లేషకులు సైతం విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఓవైపు న్యాయస్థానానికి ఫార్మాసిటీని కొనసాగిస్తామని చెప్తూనే, మరోవైపు అక్కడే ఫ్యూచర్ సిటీ అంటూ హడావుడి చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఇది ప్రజలతోపాటు వ్యాపారవేత్తలను, కంపెనీలనూ మోసం చేయడం కాదా? అని ప్రశ్నిస్తున్నారు. పైగా కనీసం ఉనికి ఎక్కడో తెలియని ఫ్యూచర్ సిటీని రోజుకో అంతర్జాతీయ నగరంతో పోల్చడాన్ని సైతం ఎద్దేవా చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడే ముందు అది ఎక్కడ నిర్మిస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

అసెంబ్లీలో ప్రకటనకు విలువ లేదా?

- బెనిఫిట్ షోలపై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం
- సర్కార్‌పై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులిస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): సినిమా టికెట్ రేట్లు పెంచేది లేదని అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం చేసిన ప్రకటనలు నీటి మూటలే అయ్యాయని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా ఇక బెనిఫిట్‌షోలు ఉండవని చెప్పిన కొద్దిరోజులకే సర్కార్ మాటతప్పిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.'నేను అధికారంలో ఉన్నంత వరకు బెనిఫిట్ షోలు ఉండవు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. గేమ్ చేంజర్ సినిమా కోసం టంగ్ చేంజ్ చేశారు' అని ఎద్దేవాచేశారు. 'అసెంబ్లీలో ప్రకటించిన దానికే విలువ లేకపోతే ఎట్లా? అసెంబ్లీని కూడా తప్పుదోవ పట్టిస్తూ టికెట్ రేట్ల పెంపు, అదనపు షోకు అనుమతివ్వడం సభను అవమానించటమే' అని మండిపడ్డారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు ముఖ్యమంత్రిపై, మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన కింద నోటీసులిస్తామని ప్రకటించారు. 'మాట తప్పం.. మడమ తిప్పం అంటూ బీరాలు పలికి ఇప్పుడు టికెట్ రేట్ల పెంపునకు ఎలా అనుమతిచ్చారు? ఎవరికి లాభం కోసం ఆ నిర్ణయం తీసుకున్నారు?' అని ప్రశ్నించారు. గతంలో బెనిఫిట్ షోలకు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతి ఇవ్వడం వల్లే ఓ మహిళ మృతి చనిపోయిందని, మరో పసివాడు ఇంకా దవాఖానలో చికిత్స పొందుతున్నాడని గుర్తుచేశారు. ఆ పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిది, సీఎం రేవంత్‌రెడ్డిది కాదా? అని ప్రశ్నించారు. ఆ దురదృష్ట ఘటనను మరిచిపోకముందే ప్రభుత్వం యూటర్న్ తీసుకోవటం వెనుక ఆంతర్యం ఏమిటని నిలదీశారు. శుక్రవారం మాదాపూర్‌లోని ప్రసాద్‌ల్యాబ్స్‌లో కల్ప్రా వీఎఫ్ఎక్స్ ప్రారంభోత్సవానికి హరీశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిత్రపరిశ్రమ అభ్యున్నతికి ఏఐ విజువల్ ఎఫెక్ట్స్ టెక్నాలజీ చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ టెక్నాలజీతో రూపొందించిన ఆర్ఆర్ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు రావడం తెలుగువారికి గర్వకారణమని కొనియాడారు. కల్ప్రా వీఎఫ్ఎక్స్ సీఈవో మల్లీశ్వర్ సిద్దిపేటలో ఐటీ కంపెనీ పెట్టి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించిందని అభినందించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో చిత్రపరిశ్రమను ప్రోత్సహించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ సర్కారు మాత్రం కక్ష సాధింపుతో చిత్రపరిశ్రమను దిగజార్చుతున్నదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తనకు నచ్చితే ఒకలా, నచ్చకపోతే మరోలా అనుచిత నిర్ణయాలు తీసుకోవడం దురదృష్టకరమని, రూల్స్ అంటే అందరికీ ఒకేలా ఉండాలని, లక్షల మందికి ఉపాధి కల్పించే చిత్రపరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని చెప్పారు.

అర్ధరాత్రి వేళల్లో సినిమాలేంటి?

- ప్రజల ఆరోగ్యం, బాగోగులు మీకు పట్టవా?
- అదనపు షోలకు అనుమతి ఇవ్వొద్దు
- 'గేమ్ చేంజర్' టికెట్ ధరల పెంపుపై 24 గంటల్లోగా పునఃసమీక్షించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): బెనిఫిట్ షోలకు అనుమతి లేదంటూనే అదనపు షోల పేరుతో ఎలా అనుమతిస్తారని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. రాష్ట్రంలో అదనపు షోలను అనుమతించడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అర్ధరాత్రి, తెల్లవారుజామున సినిమాలను ప్రదర్శిస్తే ప్రజల ఆరోగ్యం ఏంకావాలని, అర్ధరాత్రి 2 గంటల తర్వాత మీ పిల్లలను రోడ్లపై తిరిగేందుకు, సినిమాలు చూసేందుకు అనుమతిస్తారా అని ప్రశ్నించింది. ప్రజల భద్రత కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేవరకు తెల్లవారుజాము వేళల్లో సినిమా ప్రదర్శనలకు అనుమతి ఇవ్వరాదని తేల్చి చెప్పింది. ప్రభుత్వ తీరు మారకపోతే రాత్రి 11 గంటల తర్వాత థియేటర్లు, పబ్‌ల మూసివేతకు స్వయంగా తామే ఉత్తర్వులు జారీ చేస్తామని ఘాటుగా హెచ్చరించింది. టికెట్ల రేట్లను పెంచబోమని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం 'గేమ్ చేంజర్' సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతించడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ధరల పెంపుఉత్తర్వులపై 24 గంటల్లోగా పునఃసమీక్ష చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'గేమ్ చేంజర్' సినిమా అదనపు షోలకు, టికెట్ ధరల పెంపునకు అనుమతిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపి ఉత్తర్వులు జారీ చేసింది.

జడ్చర్లలో మావోయిస్టుల లేఖ కలకలం

మహబూబ్‌నగర్, జనవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్వగ్రామంలో మావోయిస్టుల లేఖ కలకలం సృష్టించింది. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ లచ్చన్న దళం పేరు మీద గ్రామంలోని ఓ ఇంటికి లేఖను అతికించారు. లేఖలో జడ్చర్ల ఎమ్మెల్యే, ఆయన సోదరుడు, అనుచరులు పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే ప్రజా కోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బలవంతంగా పేదల భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు కలిసి బాలానగర్, రాజాపూర్ ప్రాంతాల్లో ఉన్న కంపెనీలను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ యంత్రాంగం ఈ లేఖపై విచారణ చేపట్టింది.

- మణికొండలో నాలుగు విల్లాల నేలమట్టం

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ పెద్ద చెరువు ఎగువ ప్రాంతంలో గత కొన్నాళ్లుగా నిర్మాణాలు చేపడుతున్న లేక్ వ్యూ వెంచర్‌లో నాలుగు విల్లాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో కూల్చివేశారు. చెరువు బఫర్‌జోన్ల పరిధిలో నిర్మితమౌతున్న ఈ విల్లాలకు పలుమార్లు మున్సిపాలిటీ, ఇరిగేషన్‌శాఖ అధికారులు నోటీసులు జారీచేసినా మొండిగా నిర్మాణాలు చేపడుతుండటంతో స్థానిక ప్రజలు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ నెక్నాంపూర్‌లో పర్యటించిన మరుసటిరోజే కూల్చివేతలను చేపట్టారు. - మణికొండ

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

- ఇంజినీర్లకు మంత్రి ఉత్తమ్ పిలుపు

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): నీటిపారుదల శాఖలో పనిచేసే ఇంజినీర్లు విధి నిర్వహణలో అలసత్వం చూపవద్దని, నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ రూపొందించిన 2025 డైరీని జలసౌధలో శుక్రవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఇంజినీర్లు క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రాధన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఈఎన్సీలు అనిల్‌కుమార్, విజయభాస్కర్‌రెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్ రాపోలు రవీందర్, ప్రధాన కార్యదర్శి చక్రధర్, గౌరవాధ్యక్షుడు ధర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, మధుసూదన్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- గిరాకీ లేక కొత్తగూడెంలో అవినాశ్ బలవన్మరణం

అవినాశ్ (ఫైల్)

రామవరం, జనవరి 10: గిరాకీ లేక.. కుటుంబం గడుపక.. ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. స్థానిక రామవరం వసందాస్ గడ్డకు చెందిన ఎర్రి అవినాశ్ (30) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటోలకు గిరాకీ లేక ఆర్థిక సమస్యలు తలెత్తాయి. జీవితంపై విరక్తితో అవినాశ్ శుక్రవారం రాత్రి ఇంటికి దగ్గరలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

'ఎల్ఆర్ఎస్'లను పరిష్కరించాలి: కూనంనేని

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం పేదలకు చెందిన లక్షల దరఖాస్తులు ఏండ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): త్వరలో ఎన్నికలు జరుగనున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం నియోజకవర్గ టీచర్స్ అభ్యర్థిగా పులి సరోత్తంరెడ్డి(వరంగల్), కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ నియోజకవర్గ టీచర్స్ అభ్యర్థిగా మల్క కొమరయ్య(పెద్దపల్లి), కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ నియోజకవర్గ గ్రాడ్యుయేట్స్ అభ్యర్థిగా సీ అంజిరెడ్డి(సంగారెడ్డి)ని ఖరారుచేశారు.

రూ. 168 కోట్లతో చేనేత అభయహస్తం

- మంత్రి తుమ్మల వెల్లడి

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమానికి రూ.168 కోట్లతో చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. పథకాన్ని ఆమోదించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి), తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న బీమా), తెలంగాణ నేతన్నకు భరోసా అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

పథకాల అమలు బాధ్యత కలెక్టర్లదే

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో అనేక పథకాలను ప్రారంభించినట్టు మంత్రి పొంగులేటి తెలిపారు. పథకాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. సచివాలయంలో కలెక్టర్లతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 26 నుంచి రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు.

రూల్స్ పాటించకపోతే బస్సులు సీజ్ చేస్తాం

- మంత్రి పొన్నం హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు రూల్స్ పాటించకుంటే బస్సులను సీజ్ చేస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా సచివాలయంలో ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. పండుగకు టీజీఎస్ఆర్టీసీ 6,432 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు.

ఎనుములవారి కుటుంబ పాలన?

మొదటిపేజీ తరువాయి...

రేవంత్‌రెడ్డి సోదరుడు'! రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఉంటే.. వికారాబాద్ జిల్లాకు ఆయన అన్న తిరుపతిరెడ్డే సీఎం అన్నట్టుగా వ్యవహరిస్తున్నాడనేందుకు గత డిసెంబర్ 26న కొడంగల్ నియోజకవర్గ పరిధిలో జరిగిన ఘటనే మరో నిదర్శనంగా నిలిచింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ వ్యవహారానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా ఇది 'ప్రజాపాలనా లేక కుటుంబ పాలనా?' అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తిరుపతిరెడ్డికి సెల్యూట్ కొడుతున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

పిల్లలకు బూట్లు లేకుండా ఎండలో పరేడ్

డిసెంబర్ 26న కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో అదనపు గదుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా భారీ కాన్వాయ్‌తో ఎనుముల తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ఆయన రాగానే వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర ఉన్నతాధికారులు సైతం పుష్పగుచ్ఛాలు అందించి అధికారిక మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. తిరుపతిరెడ్డి ఉన్నంత సేపూ కలెక్టర్ ఆయన వెంటే తిరుగుతూ కనిపించారు. అత్యంత విస్తుపోయే విషయమేమిటంటే గురుకుల పాఠశాల పిల్లలను ఎండలో బూట్లు లేకుండా నిలబెట్టి ఏ హోదాలేని తిరుపతిరెడ్డికి ఓ రాష్ట్రపతికో.. ప్రధానమంత్రికో.. ముఖ్యమంత్రికో చేసినట్టుగా పరేడ్ చేయించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలోనే ఇలా విద్యార్థులకు బూట్లు తీసేసి ఎండలో నిలబెట్టి పరేడ్‌తో స్వాగతం పలకడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరుపతిరెడ్డి వస్తున్నాడని గంట ముందు నుంచే విద్యార్థులను ఎండలో నిలబెట్టి కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదని తెలిసింది. ఈ తతంగానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా నెటిజెన్లు మండిపడుతున్నారు. 'ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకొంటూ రాష్ట్రంలో కుటుంబపాలన సాగిస్తున్నరు' అని సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

జిల్లా మొత్తం తిరుపతిరెడ్డి కనుసన్నల్లోనే..

తిరుపతిరెడ్డికి ఎలాంటి పదవీ లేదు. అయినా వికారాబాద్ జిల్లాకు ఆయనే సీఎంగా వ్యవహరిస్తున్నాడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంత్రులను మించి ఆయనకు పోలీస్ కాన్వాయ్, బందోబస్తు కల్పిస్తున్నారని, ఆయనతో చర్చించకుండా ఉన్నతాధికారులు ఏ నిర్ణయం కూడా తీసుకోవడం లేదని, తిరుపతిరెడ్డిని కాదని ఏ కార్యక్రమం చేసినా మరుసటిరోజు బదిలీ ఖాయమనే పరిస్థితి ఉన్నదని జిల్లాలో బాహాటంగానే చర్చ నడుస్తున్నది. జిల్లాలో పోలీసు శాఖతోపాటు అన్నిశాఖల అధికారుల పోస్టింగ్‌లు కూడా తిరుపతిరెడ్డి కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు ప్రచారంలో ఉన్నది. ఫార్మా కంపెనీ వద్దంటూ అధికారులపై తిరగబడిన లగచర్ల ఘటనలో కాంగ్రెస్‌కు చెందిన వారు ఉన్నా వారిని కేసు నుంచి తిరుపతిరెడ్డే బయటపడేశారని, ఎట్టిపరిస్థితుల్లోనూ భూములివ్వాల్సిందేనని గిరిజనులపై బెదిరింపులకు పాల్పడుతూ దౌర్జన్యం చేస్తున్నారనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో సీఎం చేతుల మీదుగా కావాల్సిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఇతర అధికారిక సమావేశాలు తిరుపతిరెడ్డితోనే చేయిస్తున్నారు. లగచర్ల ఘటనపై గతనెల కలెక్టర్‌ను కలిసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన తిరుపతిరెడ్డికి సీఎం స్థాయిలో ప్రొటోకాల్ కల్పించడం వివాదస్పదమైంది. కలెక్టరేట్‌కు వచ్చిన తిరుపతిరెడ్డికి కలెక్టర్ ప్రతీక్‌తోపాటు అదనపు కలెక్టర్ స్వాగతం పలకడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

ఎనుముల కుటుంబంలో సీఎం ఎవరో తేల్చుకోవాలి : కేటీఆర్

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రానికి అరడజను మంది ముఖ్యమంత్రులు ఉన్నారు. అది తెలంగాణ ప్రజల అదృష్టం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'ఒక్క సీఎంను ఎన్నుకుంటే వన్ ప్లస్ 6 ఆఫర్‌లా సీఎం వ్యవస్థ తెలంగాణలో వచ్చింది.. ఇటువంటి సౌకర్యం భారతదేశంలో ఎక్కడా లేదు' అని దెప్పిపొడిచారు. వికారాబాద్ జిల్లాలో ఒక కార్యక్రమానికి హాజరైన సీఎం సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డికి సమస్త అధికార యంత్రాంగం, విద్యార్థులు ఊరి పొలిమేరల నుంచి గాడ్ ఆఫ్ హానర్ ఇచ్చి స్వాగతం పలికిన వీడియోను కేటీఆర్ శుక్రవారం ఎక్స్‌వేదికగా పోస్ట్ చేశారు. 'వికారాబాద్ సీఎం తిరుపతిరెడ్డికి ఇవే నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ నిత్యం ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకుంటున్న క్రమంలో ఎనుముల కుటుంబంలో ఎవరు సీఎంగా ఉంటే బాగుంటుందో ఎంచుకొనే అవకాశం ఉంటే పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు.

విద్యార్థులకు ఏం సందేశమిస్తున్నరు?: హరీశ్

'ఎన్నో ఉన్నత చదువులు చదువుకొని.. ఎన్నో త్యాగాలు చేసి వచ్చే అఖిల భారత సర్వీస్ అధికారులు ప్రజాసేవలో తమ పరిణతిని, బుద్ధి కుశలతను ప్రదర్శించాలి. అప్పుడే ప్రజల్లో అధికారులపై గౌరవ భావం ఏర్పడుతుంది. భారత జాతీయ చిహ్నం మూడు సింహాలు తలెత్తుకొని ప్రజలపై మనకుండే బాధ్యతను గుర్తుచేస్తాయి. ప్రభుత్వాలు వస్తాయి పోతాయి.. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు. ఇది అధికారులు తెలుసుకోవాలి' అని మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. 'ప్రతీక్ జైన్ గతంలో రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా ఎంతో మంచి పేరున్న నిక్కచ్చి అధికారిగా పని చేశారు. కానీ తలవంచి దండాలు పెట్టడం.. అర్హతలేని, కనీసం ప్రజలతో వార్డ్‌మెంబర్‌గా కూడా ఎన్నికకాని వ్యక్తులకు రెడ్ కార్పెట్ వేసి తనతో తీసుకెళ్తూ చదువుకునే చిన్నారులతో సెల్యూట్లు కొట్టించడం.. ఇది దేనికి చిహ్నం?' అని శుక్రవారం ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు.'ఐఏఎస్ అధికారుల పని తీరును పర్యవేక్షించే డిపార్ట్‌మెంట్ ఇది గమనించటం లేదా? వాళ్ల పార్టీని ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి కుటుంబపాలన చేయటం ప్రజలు చూస్తూనే ఉన్నరు. ఒక ఐఏఎస్ అధికారిగా ఆ చిన్నారులకు మీరేం సందేశం ఇవ్వదలచుకున్నరు? ముఖ్యమంత్రి అన్నకు, సీఎం కుటుంబసభ్యులకు ఇలా రాచమర్యాదలు స్వాగతం పలకాలని ఏ చట్టం చెప్తున్నది?' అని నిలదీశారు.

గ్రూప్స్ సిలబస్ మార్పు?

- ఇంటర్వ్యూ విధానంపైనా చర్చలు
- మార్చిలోగా టీజీపీఎస్సీ సంస్కరణలు
- వ్యతిరేకిస్తున్న నిరుద్యోగులు

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : టీజీపీఎస్సీలో సంస్కరణలు చేపట్టనున్నారా? పోటీ పరీక్షలు సహా గ్రూప్స్ సిలబస్ మార్చనున్నారా? కొన్ని అంశాలను తొలగించనున్నారా? గ్రూప్-1, గ్రూప్-2లో మళ్లీ ఇంటర్వ్యూ విధానం తీసుకురానున్నారా? అంటే.. అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. సిలబస్ సహా పరీక్షల విధానంపైనా టీజీపీఎస్సీ అధ్యయనం చేస్తున్నట్టు తెలిసింది. మళ్లీ గ్రూప్-1, గ్రూప్-2లో ఇంటర్వ్యూలు పెడితే ఎలా